# సాక్షి నంద్యాల



బుధవారం । 5 । ఆగస్టు । 2026



## గురువులకూ పరీక్షే!

నేటి నుంచి ప్రారంభమయ్యే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. జిల్లాలో ఐదు, తెలంగాణలోని హైదరాబాద్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసింది. 8లో▸



## 'పచ్చని' సందేశం!

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కర్నూలు ఎన్‌హెచ్‌40 రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద దేశంలోనే అత్యంత విశాలమైన మొదటి రోడ్ సేఫ్టీ గార్డెన్ సిద్ధమవుతోంది. 8లో▸



## టీబీ డ్యాం సమాచారం

| | |
|---|---|
| పూర్తి మట్టం | :1,633 అడుగులు |
| ప్రస్తుతం | :1,619.28 |
| టీఎంసీల సామర్థ్యం | :105.788 |
| ప్రస్తుతం | :59.234 |
| ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు) | :98,989 |
| ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు) | :1,447 |

## న్యూస్‌రీల్

### ఎన్‌ఎస్‌టీఆర్ ఫీల్డ్ డైరెక్టర్‌గా యశోదాబాయి



ఆత్మకూరురూరల్: నాగార్జునసాగర్ – శ్రీశైలం పులుల అభయారణ్యం ఫీల్డ్ డైరెక్టర్‌గా కన్జర్వేటర్ యశోదాబాయి బాధ్యతలు స్వీకరించారు. ఎన్‌ఎస్‌టీఆర్‌లో పులుల అసహజ మరణాల ఘటనపై విచారణ జరుగుతుండడంతో ఆమె ఫీల్డ్‌లో పర్యటిస్తూ మంగళవారం ఆత్మకూరు చేరుకున్నారు. ఇన్‌చార్జ్ ఎఫ్‌డీపీటీగా వ్యవహరిస్తున్న కర్నూలు సీఎఫ్ సెల్వం నుంచి బాధ్యతలు స్వీకరించారు. కాగా సెల్వం యశోద భర్త కావడం విశేషం. యశోదాబాయి అనంతపురం సోషల్ ఫారెస్ట్‌లో సీఎఫ్‌గా పని చేశారు. అంతకు ముందు తిరుపతి జంతు ప్రదర్శనశాల క్యూరేటర్‌గా కూడా ఉన్నారు.

### అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రవేశాలు ప్రారంభం

నంద్యాల(న్యూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ కళాశాలలో 2026–27 విద్యాసంవత్సరానికి ఓపెన్ డిగ్రీ ప్రవేశాలు ప్రారంభమైనట్లు అధ్యయన కేంద్రం కో ఆర్డినేటర్ దస్తగిరి, కళాశాల ప్రిన్సిపాల్ శశికళ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈనెల 5వ తేదీ నుంచి సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. బీఏ, చరిత్ర, ఆర్థిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, బీఎస్సీ గణిత, భౌతిక, రసాయన శాస్త్రం, బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎల్ఐఎస్‌సీ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 9052324133ను సంప్రదించాలన్నారు.

### బ్యాలెట్ పేపర్ల వివరాలు కోరిన సీపీఆర్

కర్నూలు(అర్బన్): గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి బ్యాలెట్ పత్రాలకు ఎంత పేపర్ అవసరమవుతుందనే వివరాలను పంపాలని కమిషనర్ ఆఫ్ పంచాయతీ రాజ్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు జిల్లా పంచాయతీ అధికారి జి.భాస్కర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వారం రోజుల క్రితం ఎన్నికల నిర్వహణకు ఎన్ని బ్యాలెట్ బాక్సులు అవసరమవుతాయనే వివరాలను పంపించామన్నారు. తాజాగా బ్యాలెట్ పత్రాల వివరాలను కోరిందన్నారు. వార్డు సభ్యులకు తెలుపు, సర్పంచు స్థానాలకు పింక్ కలర్ పేపర్‌ను వినియోగిస్తామన్నారు. జిల్లాలో మొత్తం 484 గ్రామ పంచాయతీలకు 237 మజరా గ్రామాలు ఉన్నాయన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో 5,100 వార్డులు ఉన్నాయన్నారు.

### జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

కర్నూలు సిటీ: అన్ని యాజమాన్యాలకు చెందిన ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ ఎల్.సుధాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు అర్హులని, ఎలాంటి నేరారోపణలు, అభియోగాలు ఉండకూడదన్నారు. అవార్డుకు ప్రతిపాదనలతో పాటు, అభ్యర్థిపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు లేవని ధ్రువీకరణ పత్రాలను తనిఖీ అధికారులు జతచేయాలన్నారు. గతంలో జిల్లా స్థాయి ఉత్తమ అవార్డు పొందని వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 15లోపు దరఖాస్తులను డిప్యూటీ విద్యాధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

### ఎల్‌ఎల్‌బీ పరీక్షలకు 37 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వ విద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న ఎల్‌ఎల్‌బీ రెండో సెమిస్టర్ పరీక్షలకు మంగళవారం 37 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ ప్రొఫెసర్ నాగస్వరం నరసింహులు తెలిపారు. రెండు పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా 453 మంది విద్యార్థులకు గాను 416 మంది హాజరయ్యారు.

### 25 మండలాల్లో వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు 25 మండలాల్లో వర్షపాతం నమోదైంది. ఆలూరు, చిప్పగిరి మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. అత్యధికంగా పత్తికొండలో 36.2 మి.మీ. అత్యల్పంగా సి.బెళగల్‌లో 0.2 మి.మీ వర్షం కురిసింది. ఆదోనిలో 35.2, కోసిగి 32.6, పెద్దకడబూరు 30.6 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 117 మి.మీ ఉండగా నాలుగు రోజుల్లో 15.3 మి.మీ వర్షం కురిసింది. రానున్న రోజుల్లో కూడా ఒకటి రెండు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## సాగునీటి ప్రాజెక్టులపై ఇంత నిర్లక్ష్యమా

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో సీమ ప్రజలకు తాగు, సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. కేవలం మోటార్లు బిగిస్తే పథకాన్ని ప్రారంభించే అవకాశం ఉంది. అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు తెలంగాణ ముఖ్యమంత్రితో కుమ్మక్కై గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేయించి పనులు అడ్డుకున్నారు. కూటమి ప్రభుత్వం గోరుకల్లు కట్ట కుంగిపోయిన చోటా ఇప్పటికీ పనులు పూర్తి చేయించలేదు. ఈ ఏడాది అసలు గోరుకల్లులో ఎన్ని టీఎంసీలు నిల్వ చేస్తారు.. ఆయకట్టుకు నీరు ఎప్పుడు ఇస్తారో తెలియడం లేదు. ప్రాజెక్టులపై ఇంత నిర్లక్ష్యమా.. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని సాధించే వరకు పోరాటం చేస్తాం. రాయలసీమలో నీటి హక్కుల సాధనకు ప్రతి ఒక్కరూ ఉద్యమంలో భాగస్వాములు కావాలి. రాయలసీమ ఎత్తిపోతల పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరిస్తాం. చంద్రబాబు నాయుడు రాయలసీమకు చేస్తున్న మోసాలను ప్రతి రైతు గుర్తించాలి. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లేపాక్షి – పోతిరెడ్డిపాడు వరకు పాదయాత్ర చేశారు కాబట్టే రాయలసీమలో ప్రాజెక్టులకు మోక్షం వచ్చింది.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు



అవుకు టన్నెల్

## గురుశిష్యులు ప్రాజెక్టులను నీరుగారుస్తున్నారు



గురుశిష్యులు చంద్రబాబునాయుడు, రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సీఎంలుగా కొనసాగుతూ రాయలసీమ ప్రాజెక్టును నీరుగారుస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంతో నాలుగు టీఎంసీల సామర్థ్యం ఉన్న అవుకు రిజర్వాయర్‌లో రెండు టీఎంసీల నీరు నిల్వ చేసుకోలేని పరిస్థితులు నెలకొన్నాయి. రిజర్వాయర్‌కు పడిన గండికి ఇప్పటి వరకు మరమ్మతులు చేపట్టలేక పోవడం సిగ్గు చేటు. గోరుకల్లు రిజర్వాయర్‌లో 13 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉన్నా కట్ట కుంగి 8–9 టీఎంసీల నీరు నిల్వ చేసుకోలేని పరిస్థితి నెలకొంది. ఇటీవలచంద్రబాబునాయుడు బనగానపల్లె పర్యటనలో కాల్వలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని మంత్రి బీసీ.. సీఎం దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం స్పందించలేదు. నాలుగుసార్లు సీఎంగా చేసిన బాబు సీమ పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేకపోయారు. ఆయన అధికారంలోకి వచ్చారంటే తప్పకుండా కరువు వస్తుంది. – కాటసాని రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే బనగానపల్లె

- సాగునీటి ప్రాజెక్టులను పరిశీలించిన వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ
- గోరుకల్లు, అవుకు రిజర్వాయర్ల వద్ద బయటపడిన ప్రభుత్వ నిర్లక్ష్యం
- చంద్రబాబు తీరును ఎండగట్టిన పార్టీ నేతలు
- తెలుగుదేశం ప్రభుత్వ మొద్దునిద్రను మేల్కొలుపుదామని పిలుపు
- గురుశిష్యులతో సీమకు అన్యాయమంటూ మండిపాటు
- రాయలసీమ ఎత్తిపోతల ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్తామని స్పష్టం
- సంఘీభావం ప్రకటించిన రైతులు, ప్రజలు
- అడుగడుగునా అడ్డుకున్న పోలీసులు



గోరుకల్లు రిజర్వాయర్‌లో కుంగిన కట్టను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, రైతులు, ప్రజలు

# ప్ర'జల' గొంతులై.. పోరాట ప్రవాహమై!



గోరుకల్లు వద్ద మాజీ మంత్రి శైలజానాథ్, అనంతపురం రూరల్ మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి



అవుకు రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎమ్మెల్యే గంగుల, దారా సుధీర్



గోరుకల్లు రిజర్వాయర్ వద్ద మాజీ ఎమ్మెల్యేలు శిల్పా రవి, శిల్పా చక్రపాణిరెడ్డి

పాణ్యం/కోవెలకుంట్ల: సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం వహిస్తున్న తెలుగుదేశం ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నాయకులు పోరుబాట పట్టారు. నీటి హక్కుల సాధన ఉద్యమంలో ప్రజలు, రైతులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సీమ ప్రాజెక్టులను తెలంగాణకు తాకట్టు పెట్టిన సీఎం చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తామంటూ అడుగులు వేశారు. వారికి సంఘీభావంగా రైతులు, ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు వెంట నడిచారు. అడుగడుగునా పోలీసులు అడ్డంకులు సృష్టించినా బెదరలేదు. జల ప్రవాహమై పోరాట స్ఫూర్తిని చాటారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధనలో భాగంగా మంగళవారం వైఎస్సార్‌సీపీ టాస్క్‌ఫోర్స్ కమిటీ నాయకులు పాణ్యం, బనగానపల్లె నియోజకవర్గాల్లోని సాగు నీటి ప్రాజెక్టులను సందర్శించారు. వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి శైలజానాథ్, అనంతపురం రూరల్ మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా రవి చంద్రకిషోర్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, గంగుల బిజేంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, నందికొట్కూరు ఇన్‌చార్జ్ దారా సుధీర్, జెడ్పీ చెర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి తదితరులు సాగునీటి ప్రాజెక్ట్‌లను సందర్శించారు. గోరుకల్లు జలాశయంలో ఉన్న నీటి నిల్వ, కుంగిన కట్ట, నత్తనడకగా జరుగుతున్న పనులు, పెండింగ్ పనులపై ఆరా తీశారు. గోరుకల్లు రిజర్వాయర్ నుంచి నేరుగా అవుకు టన్నెళ్ల వద్దకు చేరుకున్నారు. అనంతరం అవుకు రిజర్వాయర్‌ను పరిశీలించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అవుకు రిజర్వాయర్ రివెట్‌మెంట్ దెబ్బతిని నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు మరమ్మతు పనులు చేపట్టలేదని రైతులు కమిటీ దృష్టికి తెచ్చారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే సొరంగ మార్గాలు దాదాపు పూర్తి అయ్యాయని, అరకొరగా పెండింగ్ పనులను సైతం 2014 అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం గాలికొదిలేసిందని రైతులు వాపోయారు. మిగిలిపోయిన పనులను 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పూర్తి చేసి నీటి విడుదలకు మార్గం సుగమం చేసిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ముందు చూపుతో మూడో సొరంగ నిర్మాణానికి శ్రీకారం చుట్టి పనులు చేపట్టగా ప్రస్తుత సర్కార్ ఆ పనులను మధ్యలో నిలిపి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసు నుంచి బయట పడేందుకు చంద్రబాబు నాయుడు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తెలంగాణకు తాకట్టు పెట్టారని విమర్శించారు. వైఎస్సార్ హయాంలోనే గోరుకల్లు, అవుకు రిజర్వాయర్ సామర్థ్యం పెంచారని రైతులు గుర్తు చేసుకున్నారు.

### తరలివచ్చిన రైతులు, నేతలు

ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 500 మందికిపైగా రైతులు, రైతు సంఘాల నాయకులు, ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తరలివచ్చారు. పార్టీ రాష్ట్ర పార్లమెంటరీ సెక్రటరీ సద్దల సూర్యనారాయణరెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, పార్టీ నేతలు బుడ్డా శేషారెడ్డి, వంగాల భరత్‌కుమార్‌రెడ్డి, పార్టీ మహిళా విభాగం నాయకురాళ్లు శశికళ, శ్వేతారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు చల్లా విఘ్నేశ్వరరెడ్డి, గుండం సూర్యప్రకాష్‌రెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డి, కాటసాని ఓబుళరెడ్డి, కాటసాని ప్రసాదరెడ్డి, చల్లా రాజశేఖర్‌రెడ్డి, పాణ్యం మండల కన్వీనర్ కరుణాకర్‌రెడ్డి, సద్దల సుజిత్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, అనిల్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### తెలంగాణతో బాబు చీకటి ఒప్పందం

సీమ ప్రజల ఆకాంక్ష రాయసీమ ఎత్తిపోతల పథకం. తాగు, సాగునీటి కోసం ప్రజలు ఉద్యమాలు చేస్తుంటే టీడీపీ పాలకులు ఏమి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. తెలంగాణతో బాబు చీకటి ఒప్పందాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి అసెంబ్లీలో చెబితే గాని అర్థం కాలేదు. సీమనే కాదు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టాలనే ఉద్దేశంతో ఉన్నారు. రాయలసీమ ప్రాజెక్ట్‌ను అడ్డుకున్న చంద్రబాబు నాయుడు చరిత్రహీనులుగా మిగిలిపోతారు.

– శిల్పా రవి చంద్రకిషోర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే నంద్యాల

### బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్తాం

బాబు పాలనలో ఏనాడు సంవృద్ధిగా వర్షాలు పడిన దాఖలాలు లేవు. ఆయన పాలనలో కరువు వస్తుందని రైతులకు మళ్లీ తెలిసిపోయింది. చంద్రబాబు నిర్లక్ష్యంతో కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజలు నష్టపోతున్నారు. ఆయన చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేస్తాం. ఉద్యమాలను గ్రామస్థాయి తీసుకెళ్తాం. రాయలసీమ ఎత్తిపోతల పథకం మనకు జీవనాడి. సీమలోని ప్రాజెక్టుల కోసం ప్రజలందరూ ఏకం కావాల్సిన అవసరం ఉంది. రైతులను చైతన్యవంతుల్ని చేసేందుకు, సమస్యలపై పోరాటం చేసేందుకు జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేస్తాం.

– శిల్పా చక్రపాణిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం

### సీమకు బాబు ద్రోహం

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జలయజ్ఞం పేరుతో సీమకు కృష్ణా జలాలను మళ్లించి సస్యశ్యామలం చేశారు. ఆయన అడుగుజాడల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి దాదాపుగా 80 శాతం పనులు పూర్తి చేశారు. మోటార్లు బిగిస్తే సీమకు నీళ్లు ఎత్తిపోయొచ్చు. చంద్రబాబు నాయుడు ఈ పథకం పనులు నిలిపివేసి సీమకు ద్రోహం చేస్తున్నారు. సాక్షాత్తు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించడంతో విషయం వెలుగులోకి వచ్చింది.

– ఇసాక్‌బాషా, ఎమ్మెల్సీ

### మంత్రి హామీకే దిక్కులేదు

40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు నాయుడు తన పాలనలో ఒక సాగు నీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా. కూటమి ప్రభుత్వం సీమ ప్రాజెక్టులను గాలికొదిలేసింది. గత ఏడాది సాక్షాత్తు మంత్రి నిమ్మల రామానాయుడు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించి రూ. 53 కోట్లు కేటాయిస్తున్నామని ప్రగల్భాలు పలికారు. మంత్రి హామీకే దిక్కులేదు. సీమకు న్యాయం జరగాలంటే 2029లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాలి, సీమ నుంచి ఇరిగేషన్ మంత్రి ఉండాలి.

– దారా సుధీర్, నందికొట్కూర్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి

## అడుగడుగునా అడ్డంకులు..



గోరుకల్లు వద్ద వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు

పాణ్యం: గోరుకల్లు జలాశయాన్ని పరిశీలించేందుకు వైఎస్సార్‌సీపీ నేతలు వస్తున్నారనే సమాచారం తెలుసుకున్న పోలీసులు ఎక్కడికక్కడే చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి అడ్డుకునే ప్రయత్నం చేశారు. మంగళవారం ఉదయం నుంచి పాణ్యం రహదారి డొంగు వద్ద పోలీసులు గోరుకల్లు వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేసి పంపారు. అనుమానం వచ్చిన వాహనాలను దారి మళ్లించారు. అలాగే గోరుకల్లు గ్రామం వద్ద ప్రముఖుల వాహనాలనే జలాశయం వద్దకు పంపించారు. మిగతా వాహనాలను ఆపేశారు. కట్టపై బురద ఉందని వాహనాలను అడ్డుకున్నారు. దీంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు, రైతు సంఘాల నాయకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అడుగడుగునా పోలీసులు ఇబ్బందులు పెట్టినా రైతులు, నాయకులు రిజర్వాయర్ వద్దకు చేరుకున్నారు.

సంజామల: అవుకు రిజర్వాయర్ సందర్శనకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను మంగళవారం పోలీసులు అడ్డుకున్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం సాధన కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు అవుకు రిజర్వాయర్‌ను సందర్శించారు. వారికి సంఘీభావం తెలపడానికి వెళ్తున్న మండల నాయకులు, కార్యకర్తలను ఆకుమల్ల వద్ద పోలీసులు అడ్డుకున్నారు.



అవుకు రిజర్వాయర్ వైపు వెళ్లకుండా బారికేడ్లు పెట్టి అడ్డుకుంటున్న పోలీసులు

## ముగిసిన మొహర్రం సంతాప దినాలు



మాతంలో పాల్గొన్న షియా మతస్తులు

బనగానపల్లె రూరల్: బనగానపల్లెలో మొహర్రం సంతాప దినాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ముగిశాయి. మొహర్రం వేడుకలు జూన్ 26న పీర్ల నిమజ్జనంతో ముగిశాయి. అప్పటి నుంచి 40 రోజుల పాటు షియా మతస్తులు సంతాప దినాలుగా భావిస్తారు. మొహర్రం సంతాప దినం సందర్భంగా మధ్యాహ్నం స్థానిక అస్థానం నుంచి బనగానపల్లె నవాబు వంశీయులు నవాబు మీర్‌ఫజలే అలీఖాన్ ఆధ్వర్యంలో షియా మతస్తులు భక్తిగీతాలు పాడుతూ చురకత్తులతో శరీరంపై కొట్టుకుంటూ తమ రక్తాన్ని చిందించి భక్తిని చాటుకున్నారు. మాతం కార్యక్రమం అస్థానం నుంచి పోస్టాఫీస్ మీదుగా నవాబుకోట వరకు సాగింది. అలాగే కొండపేటలోని పీర్లచావిడిలో కొలువు దీరిన ఇమాం హసన్, ఇమాంహుస్సేన్ పీర్ల చావిడి నుంచి షియా మతస్తులు మాతం చేశారు. సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ కల్పన ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు.



మాతంలో పాల్గొన్న బనగానపల్లె నవాబు మీర్‌ఫజలే అలీఖాన్

## నిరాశాజనకంగా వేరుశనగ ధరలు

- ఆదోని మార్కెట్‌లో క్వింటా పత్తి రూ.10,156

కర్నూలు(అగ్రికల్చర్): వేరుశనగ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముందస్తు ఖరీఫ్‌లో నీటి వసతి కింద సాగు చేసిన వేరుశనగ దిగుబడులు కొద్ది రోజులుగా మార్కెట్‌లకు వస్తున్నాయి. కర్నూలు మార్కెట్‌కు 2,132 క్వింటాళ్లు, ఎమ్మిగనూరు మార్కెట్‌కు 4,135, ఆదోని మార్కెట్‌కు 2,223 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. నీటి వసతి కింద సాగు చేసే వేరుశనగ సాగులో పెట్టుబడి వ్యయం ఎక్కువగా ఉంటుంది. క్వింటాకు కనీసం రూ.9 వేల వరకు ధర లభిస్తే గిట్టుబాటు అవుతుంది. అయితే కర్నూలు మార్కెట్‌లో గరిష్ట ధర రూ.8,260, ఎమ్మిగనూరు మార్కెట్‌లో రూ.8,401, ఆదోని మార్కెట్‌లో రూ.8,799 ధరలు లభించాయి.

- ఇదిలాఉంటే ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం రైతుల వద్ద పత్తి నిల్వలు లేవు. వ్యాపారులు గోదాముల్లో నిల్వ చేసిన పత్తి మార్కెట్‌కు వస్తోంది. ఆదోని మార్కెట్‌కు 329 క్వింటాళ్ల పత్తి రాగా కనిష్ట ధర రూ.9వేలు, గరిష్ట ధర రూ.10,156 లభించింది. సగటు ధర రూ.9,771 నమోదైంది.

## కోదండరాముడికే శఠగోపం!

- ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామంలో మాన్యం భూమిని విక్రయించిన టీడీపీ నేతలు
- రెవెన్యూ అధికారులు సహకారం.. పట్టించుకోని దేవదాయ శాఖ అధికారులు



దేవుని మాన్యంలో వెలసిన గృహాలు

టాస్క్‌ఫోర్స్: టీడీపీ నేతల అవినీతి, అక్రమాలకు అంతులేకుండా పోతోంది. గ్రామాల్లో ఆలయాల మాన్యం భూములను సైతం దిగమింగుతూ దేవుళ్లకే శఠగోపం పెడుతున్నారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం చంద్రపల్లె గ్రామంలోని కోదండరామ స్వామికి దశాబ్దాల క్రితం దూపదీప నైవేద్యాల కోసం సర్వే నెంబర్ 148,148–ఏ2లో 10 ఎకరాల భూమిని దాతలు విరాళంగా ఇచ్చారు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మాన్యం భూమిని సెంట్ల చొప్పున ప్లాట్లు వేస్తూ ధర్మకర్త సహకారంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు విక్రయిస్తూ గుట్టుచప్పుడు కాకుండా సొమ్ము చేసుకున్నారు. ఇందులో కొందరికి రెవెన్యూ అధికారులు అనుబంధ పట్టాలు సైతం మంజూరు చేయడం విశేషం. చాలా మందికి ఎలాంటి రిజిష్టర్లు లేకుండా కేవలం అగ్రిమెంట్ కాగితాల మీదనే విక్రయించారు. ఈ తతంగం వెనకాల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుని హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.

### తీగ లాగితే డొంక కదిలింది..

గ్రామానికి చెందిన యువకుడు మేఘనాథ్‌రెడ్డి తన ఇంటి ముందు దశాబ్దాల కాలం నుంచి ఉన్న రస్తాను ఇతరులు కొనుగోలు చేశామని మూసివేసి అడ్డంకులు కల్పించడంతో ఈ తతంగం వెలుగులోకి వచ్చింది. ఇన్ఫర్మేషన్ యాక్ట్ ద్వారా వివరాలు అడిగిన మేఘనాథ్‌రెడ్డికి ఇటు రెవెన్యూ అటు దేవదాయ, ధర్మదాయ శాఖాధికారులు సరైన సమాచారం ఇవ్వకుండా దాటవేస్తూ వచ్చారు. ఈక్రమంలో గ్రామంలో కొందరు ఈ మాన్యం భూమిని కొనుగోలు చేశామని బాహాటంగా బయటకు రావడంతో టీడీపీ నాయకుల బండారం బట్టబయలైంది. చేసిన తప్పులను సరిదిద్దేందుకు అధికారులు ప్రయత్నించకపోగా తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తమ ఇంటి ముందు ఉన్న మాన్యం భూమిలోని రస్తాను సైతం ధర్మకర్తలు విక్రయించడాన్ని మేఘనాథ్‌రెడ్డి తప్పుపడుతున్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి కోట్లాది రూపాయల విలువైన మాన్యం భూమిని కాపాడాలని చంద్రపల్లె గ్రామస్తులు కోరుతున్నారు.

## క్లుప్తంగా

## సాంబార్‌లో పడి చిన్నారికి తీవ్రగాయాలు


తీవ్ర గాయాలపాలైన చిన్నారి మీనా

దేవనకొండ: మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన ఉపేంద్ర, లలిత దంపతుల కుమార్తె మీనా (4) ప్రమాదవశాత్తు వేడి సాంబారులో పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఉపేంద్ర తన పొలంలో బోరు మోటార్ దింపి కార్మికులకు భోజనాలు పెట్టేందుకు ఇంటి వద్ద వంట సిద్ధం చేశారు. ఉడికిన సాంబారు పాత్రను కిందకు దింపి ఉంచగా అక్కడ ఆడుకుంటున్న పాప పాత్రలో పడింది. గమనించిన తల్లిదండ్రులు హుటాహుటిన బయటికి తీసి దేవనకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా ప్రాథమిక వైద్యం అందించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడినుంచి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లారు.

## పాముకాటుతో వ్యక్తి మృతి


మృతి చెందిన రామమద్దిలేటి

బనగానపల్లె రూరల్: మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామతీర్థం గ్రామానికి చెందిన రామమద్దిలేటి (41)ని పాము కాటు వేయడంతో మృతి చెందాడు. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. రామమద్దిలేటి లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. సోమవారం రాత్రి పలుకూరులో డ్రైవింగ్ పని ముగించుకొని రామయ్య అనే వ్యక్తితో కలిసి స్వగ్రామానికి బైక్‌పై బయలుదేరాడు. ఊరువాకిలి సమీపంలో బైక్ దిగి రోడ్డు పక్కన రామమద్దిలేటి మూత్రం పోస్తుండగా కాలికి విషసర్పం కాటువేసింది. కుటుంబ సభ్యులకు విషయం చెప్పడంతో వెంటనే చికిత్స కోసం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే రామమద్దిలేటి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. నందివర్గం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.


రోడ్డు సేఫ్టీ పార్కు ముఖ ద్వారం


అడుగడుగునా భద్రతా పాఠం


తెలుసుకుంటే ప్రయాణం సులువు..



ఈ లైన్స్ ఉన్న చోట క్రాస్ చేయరాదు..


ప్రతి సింబల్‌కు ఒక అర్థం

కర్నూలు శివారులోని రింగ్ రోడ్డు వద్ద రూపుదిద్దుకున్న రోడ్డు సేఫ్టీ పార్కు



# 'పచ్చని' సందేశం!

పార్క్ మొత్తం విస్తీర్ణం: 2 ఎకరాలు

నాటిన మొత్తం మొక్కల సంఖ్య: 20,712 | స్వదేశీ వృక్ష జాతులు: 56 రకాలు

రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కర్నూలు ఎన్‌హెచ్‌40 రింగ్ రోడ్డు జంక్షన్ వద్ద భారతదేశంలోనే అత్యంత విశాలమైన మొదటి రోడ్ సేఫ్టీ గార్డెన్(మియావాకి ప్రాజెక్ట్) సిద్ధమవుతోంది. 2025 మార్చి నెలలో ఆర్‌ఈపీఎల్ హెడ్ వి.మదన్‌మోహన్ నేతృత్వంలో ఈ ప్రాజెక్టు విజయవంతంగా తుది మెరుగులు దిద్దుకుంటోంది. ఈ మియావాకి వనంలో నీటి నిర్వహణను ఒక సవాలుగా తీసుకుని పరిష్కరించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు నీరు నిల్వ ఉండి మొక్కల వేర్లు కుళ్ళిపోకుండా ప్రాజెక్టు ప్రాంగణం చుట్టూ కాలువను నిర్మించారు. వర్షపు నీరు బయటకు పోకుండా భూమిలోకి ఇంకేలా 10 రీచార్జ్ గుంతలను ఏర్పాటు చేశారు. తోట భద్రత, మొక్కల సంరక్షణతో పాటు సందర్శకుల భద్రతను సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు. ఒకప్పటి చెత్త కుప్ప... నేడు ప్రాణవాయువును అందించే పచ్చని అడవిగా, ప్రమాదాలను నివారించే రోడ్డు భద్రతా అవగాహన పాఠశాలగా మారుతుండటం విశేషం. త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.








### ఏమిటీ 'మియావాకి'?

జపాన్‌కు చెందిన ప్రముఖ వృక్షశాస్త్రవేత్త అకిరా మియావాకి ఆవిష్కరించిన ఈ పద్ధతి ప్రపంచవ్యాప్తంగా పట్టణ వనాలను పెంచడానికి ప్రాచుర్యం పొందింది. అతి తక్కువ విస్తీర్ణంలో 56 రకాల స్వదేశీ చెట్లను నాటడం ద్వారా మొక్కలు సూర్యరశ్మి కోసం ఒకదానితో ఒకటి పోటీపడి వేగంగా పెరుగుతాయి. ఇవి సాధారణ చెట్ల కంటే 30 రెట్లు ఎక్కువగా కార్బన్ డయాక్సైడ్, కాలుష్య కారకాలను పీల్చుకుంటాయి. సహజ సిద్ధంగా ఒక దట్టమైన అడవి ఏర్పడటానికి 300 సంవత్సరాలు పడితే, మియావాకి పద్ధతిలో కేవలం 30 నుంచి 35 సంవత్సరాల వ్యవధిలోనే పరిపూర్ణ వనాన్ని సృష్టించవచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



ట్రాఫిక్ పార్కు నమూనా

### రోడ్డు భద్రతా అవగాహన కేంద్రం

ఈ పార్క్‌ను ముఖ్యంగా విద్యార్థులు, కొత్తగా వాహనాలు నడిపే వారికి బాధ్యతాయుతమైన ప్రవర్తనను నేర్పించే విద్యా వేదికగా మలిచారు. ట్రాఫిక్ సిగ్నళ్లు, నియమాలు, రహదారి భద్రతా బోర్డులను ఇక్కడ ఏర్పాటు చేసి ప్రాక్టికల్ అవగాహన కల్పించనున్నారు.


డ్రైవింగ్ సమాచారం


తొమ్మిది నెలల కష్టానికి చిత్రరూపం


పర్యావరణ హితంగా తీర్చిదిద్దిన బెంచీలు

## జలాధివాసంలోకి సంగమేశ్వరాలయం


ఆలయ శిఖరం వరకు చేరిన కృష్ణాజలాలు

కొత్తపల్లి: మరికొద్ది గంటల్లో పవిత్ర పుణ్యక్షేత్రమైన సంగమేశ్వరాలయం పూర్తిస్థాయిలో జలాధివాసం కానుంది. తీర ప్రాంతం వెంట ఎగువన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శ్రీశైలం జలాశయానికి వరద నీరు అధికంగా వచ్చి చేరుతుంది. మంగళవారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టు నుంచి రెండు లక్షల క్యూసెక్కులకు పైగా కృష్ణా నది గుండా వరద నీరు శ్రీశైలం జలాశయంలోకి చేరుతోంది. దీంతో సప్త నదుల సంగమ ప్రాంతంలో శ్రీశైలం వెనక జలాలు ప్రాచీన సంగమేశ్వర ఆలయం శిఖర భాగానికి చేరుకున్నాయి. మరో నాలుగు అడుగుల మేర శ్రీశైలం జలాశయ నీటిమట్టం పెరిగితే నేడు తెల్లవారేసరికి ప్రాచీన సంగమేశ్వరాలయం కృష్ణమ్మ ఒడిలోకి చేరుకొని జలాధివాసం అవుతుంది. కాగా ఈ ఏడాది సంగమేశ్వరాలయంలోని వేపదారు శివలింగాకార స్వామివారు 131 రోజులు భక్తులకు దర్శనమిచ్చి, విశేష పూజలు అందుకున్నారు.

## హైపవర్డ్ కమిటీ పర్యటన

ఆత్మకూరురూరల్: ఎన్ఎస్‌టీఆర్‌లోని ఆత్మకూరు, గిద్దలూరు అటవీ డివిజన్లలో ఇటీవల రెండు పెద్ద పులులు అసహజ మరణాలకు గురికావడంతో వీటిపై దర్యాప్తు జరిపి పులి సంరక్షణకు తగు సూచనలు ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన హైపవర్డ్ కమిటీ మంగళవారం ఆత్మకూరు అటవీ డివిజన్‌లో పర్యటించింది. డివిజన్‌లోని ఇందిరేశ్వరం బీట్‌లో మునిమడుగుల వాగు వద్దకు వెళ్లి పులి మరణించిన ప్రదేశాన్ని వారు పరిశీలించారు. అంతకుముందు వారు బైర్లూటి ఎకో–టూరిజం రిసార్ట్‌లో జరిగిన రివ్యూ మీటింగ్ పాల్గొన్నారు. అనంతరం వారు గిద్దలూరు డివిజన్‌కు వెళ్లారు. ఈ పర్యటనలో కమిటీ సభ్యులు అటవీ శాఖ ముఖ్య సలహాదారు మల్లికార్జునరావు, అడిషనల్ పీసీసీఎఫ్ రాహుల్ పాండే, డబ్ల్యూడబ్ల్యూఎఫ్ సభ్యుడు రాజశేఖర్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేటివ్ సొసైటీకి చెందిన ఇమ్రాన్ సిద్దిఖి, వన్యప్రాణి శాస్త్రవేత్త నవీన్ కుమార్‌తో పాటు ఎన్ఎస్‌టీఆర్ ఎఫ్‌డీపీటీ యశోధాబాయి, ఆత్మకూరు డీడీ విగ్నేష్ అపావ్ తదితరులు ఉన్నారు. ఈ పర్యటన ఆసాంతం రహస్యంగా ఉంచారు. విలేకరులను అనుమతించలేదు.

## మహిళ మృతి

బండిఆత్మకూరు: మండలంలోని పెద్ద దేవళాపురం గ్రామానికి చెందిన ధమావత్ శంకరమ్మ (58) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనపై ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపిన వివరాల మేరకు.. శంకరమ్మ సోమవారం రాత్రి ఇంట్లో కాలుజారి కింద పడగా కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల పట్టణంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించారు. అయితే వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారన్నారు. మృతురాలి కుమారుడు సుబ్బయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## పెళ్లైన నెలకే..


మాల రవి (ఫైల్)

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని హోసూరు గ్రామానికి చెందిన మాల రవి (30) మంగళవారం పాముకాటుకు గురై మృతి చెందాడు. రంగన్న, రామాంజనమ్మల కుమారుడైన రవి కూలీ పనులు చేసుకుంటూ జీవించేవాడు. నెల రోజుల క్రిందట దేవనకొండకు చెందిన లక్ష్మిని వివాహం చేసుకున్నాడు. ఆషాఢ మాసం కావడంతో ఆమె పుట్టింటికి పోగా, భార్యను పలకరించేందుకు వెళ్లి అక్కడ పడుకుని ఉండగా పాముకాటుకు గురై అపస్మారక స్థితిలో పడిపోగా చికిత్స నిమిత్తం పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పెళ్లైన నెల రోజులకే మృత్యుఒడికి చేరడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

## విద్యుదాఘాతంతో మెకానిక్ మృతి


మృతి చెందిన కంబయ్య

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని బెలుం శింగవరంలో విద్యుదాఘాతంతో మోటార్ మెకానిక్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద ఉన్న తాగునీటి బోరుకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సరి చేసేందుకు మెకానిక్ కంబయ్య (45) అక్కడున్న స్తంభాన్ని ఎక్కాడు. ఆ సమయంలో తీగ తెగి స్తంభంపైనున్న కాసారంపై పడటంతో విద్యుత్ షాక్‌కు గురై పైనుంచి కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ నగీనా ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడు కంబయ్యకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## మల్లన్న సేవలో జపాన్ భక్తులు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైల భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామి అమ్మవార్లను బెంగళూరులోని ఆధ్యాత్మిక విజ్ఞాన కేంద్రమైన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆశ్రమానికి వచ్చిన జపాన్ దేశానికి చెందిన బుద్ధిస్ట్ మాంక్స్ ఇటో మిచ్చికో, ఆమె కుమార్తె ఇటో జెన్నివో దర్శించుకొని, స్వామి అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం వీరు గంటా మఠం ఆలయాన్ని దర్శించి బిల్వం మొక్కలను నాటారు.

- టెట్‌కు రంగం సిద్ధం
- జిల్లాలో ఐదు, హైదరాబాద్‌లో రెండు కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలకు హాజరుకానున్న 31,773 మంది అభ్యర్థులు
- ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో పరీక్ష
- ఇన్ సర్వీస్ టీచర్లకూ టెట్ తప్పనిసరి
- జిల్లావ్యాప్తంగా ప్రైవేటు, ప్రభుత్వ బడుల్లో 10 వేలకుపైగా టెట్ అర్హత లేని టీచర్లు

# గురువులకూ పరీక్షే!



కర్నూలు సిటీ: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించేందుకు విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. నేటి (బుధవారం) నుంచి మొదలయ్యే పరీక్షకు జిల్లాలో ఐదు కేంద్రాలు, తెలంగాణలోని హైదరాబాద్‌లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం వేళల్లో నిర్వహించనున్న పరీక్షలు ఈ నెల 16వ తేదీ వరకు జరుగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కచ్చితంగా టెట్ అర్హత సాధించి ఉండాలని, ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం (ఆర్‌టీఈ) 2009లోని సెక్షన్ 23 ప్రకారం టెట్ అనేది ఉపాధ్యాయ నియామకానికి ఉండాల్సిన కనీస అర్హతలలో ఒకటని, ఈ చట్టం పరిధిలోకి వచ్చే స్కూళ్లలో ఉపాధ్యాయులందరికీ టెట్ కచ్చితంగా ఉండాలని సుప్రీంకోర్టు సైతం స్పష్టం చేసింది. దీంతో ప్రస్తుతం నిర్వహించనున్న టెట్‌కు అత్యధిక శాతం మంది ఉపాధ్యాయులు హాజరవుతున్నట్లు తెలుస్తోంది. మెగా డీఎస్సీకి ముందు నిర్వహించిన టెట్‌కు కొంత మంది ఉపాధ్యాయులు మాత్రమే దరఖాస్తు చేసి పరీక్ష రాశారు. ప్రస్తుతం తప్పనిసరి చేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు టెట్ పరీక్ష రాసేందుకు ఆన్ డ్యూటీ అవకాశం ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు టెట్ కన్వీనర్, పాఠశాల విద్య కమిషనర్‌కు సైతం విన్నవించారు. అయితే పరీక్షలకు హాజరయ్యే వారికి ఎలాంటి ఓడీ ఇవ్వడం లేదని, వ్యక్తిగత సెలవు పెట్టుకోవాలని విద్యాశాఖ అనధికారికంగా సంఘాల నాయకులకు సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. పాఠశాలల్లో చదువు చెబుతున్న టీచర్లకు టెట్ కంపల్సరీ చేయడంతో ఒకవైపు తరగతులు, మరోవైపు టెట్ పరీక్ష ప్రిపరేషన్‌కు సమయం సర్దుబాటు చేసుకోలేని పరిస్థితుల్లో.. పరీక్షలో అర్హత సాధిస్తామా? లేదా? అనే ఆందోళన ఉపాధ్యాయుల్లో నెలకొంది.

### జిల్లాలో టెట్ రాయనున్న 31,773 మంది!

జిల్లావ్యాప్తంగా 2254 అన్ని యాజమాన్యాల స్కూళ్లు ఉన్నాయి. ఈ స్కూళ్లలో 16,866 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. 2010 సంవత్సరానికి ముందు నియామకం అయిన టీచర్లందరూ టెట్ అర్హత పొందాల్సిందే. ఇందులో పదవీ విరమణకు రెండేళ్ల సమయం ఉన్న టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చారు. విద్యాశాఖ గణాంకాల ప్రకారం 2010కి ముందు నియామకం అయిన టీచర్లలో సుమారుగా 10 వేల మంది టీచర్లు టెట్ అర్హత పొందాల్సి ఉంది. ప్రస్తుతం జరుగనున్న టెట్‌కు జిల్లాలో 31,773 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. ఇందులో టీచర్లు 5 వేల మంది వరకు దరఖాస్తు చేసి ఉంటారని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ పరీక్షకు జిల్లాలోని కర్నూలు నగరంలో నాలుగు కేంద్రాలు, ఆదోనిలో ఒకటి, హైదరాబాద్‌లో 2 కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్దేశించిన సమయానికి గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి, హాల్ టికెట్‌పై ఫొటో లేకపోతే.. ఒరిజినల్ ఆధార్, పాన్‌కార్డు, ఓటరు కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకాన్ని గుర్తింపుగా వెంట తీసుకెళ్లాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. పీహెచ్‌సీ అభ్యర్థులు దరఖాస్తు చేసిన సమయంలో పీహెచ్‌సీ అని నమోదు చేయకపోతే, డీఈఓ అనుమతి తీసుకొని సహాయకుడిని పొందవచ్చు.

## శ్రీశైలం డ్యాంలో పెరుగుతున్న నీటిమట్టం

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. రోజుకు సగటున 15 టీఎంసీలకు పైగా వరదనీరు డ్యాంకు వచ్చి చేరుతోంది. జూరాల ప్రాజెక్ట్ నుంచి మంగళవారం సాయంత్రం సమయానికి 2,48,148 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి విడుదలవుతుంది. విద్యుత్ ఉత్పాదన అనంతరం 26,817 క్యూసెక్కులు, స్పిల్‌వే ద్వారా 2,21,331 క్యూసెక్కుల నీటిని శ్రీశైలానికి వదులుతున్నారు. జలాశయం నుంచి కల్వకుర్తి ఎత్తిపోతలకు 800 క్యూసెక్కుల నీరు విడుదలయ్యింది. జలాశయం పరిసర ప్రాంతాలలో 2.20 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ప్రస్తుతం జలాశయంలో 108.4880 టీఎంసీల నీటి నిల్వ ఉంది. డ్యాం నీటిమట్టం 860.80 అడుగులకు చేరుకుంది.

## టీబీ డ్యాంకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హోస్పేట్ వద్ద నిర్మించిన ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయానికి మంగళవారం భారీ ఎత్తున వరద పోటెత్తింది. సోమవారం ఉదయం డ్యాంలో 44.190 టీఎంసీల నీరు నిల్వ ఉండి ఇన్‌ఫ్లో 90 వేల క్యూసెక్కుల వరకు రావడంతో మంగళవారం ఉదయం నాటికి 51.145 టీఎంసీల నీరు నిల్వ అయ్యాయి. ఒక్క రోజులోనే 7 టీఎంసీల మేర నీరు వచ్చి చేరింది. సాయంత్రం నాటికి ఇన్‌ఫ్లో లక్ష క్యూసెక్కులకు చేరడంతో బుధవారం ఉదయం నాటికి 60 టీఎంసీల (పూర్తి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు) నీరు నిల్వ కానున్నాయి. నీటిమట్టం1633 అడుగులకు గాను 1620 అడుగులకు చేరింది. డ్యాం ఎగువన నిర్మించిన గాజనూరు జలాశయం(అప్పర్ తుంగా) పైభాగంలోని శివమొగ్గ, తీర్థనహళ్లి, శృంగేరి, వరనాడు, మలెనాడు, కొప్ప ప్రాంతాల్లో విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా తుంగభద్ర రిజర్వయర్‌కు పెద్ద ఎత్తున వరద నీరు వచ్చి చేరుతోంది. వర్షాలు ఇదే విధంగా ఉంటే వారం పది రోజులో డ్యాం నిండే అవకాశాలున్నాయి.

## పర్యాటక రంగ అభివృద్ధికి కృషి


హరిత హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న చైర్మన్ బాలాజీ యాదవ్

కర్నూలు కల్చరల్: పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ యాదవ్ పేర్కొన్నారు. కర్నూలు వెంకటరమణ కాలనీలోని ఏపీటీడీసీ హరిత యూనిట్‌ను మంగళవారం రాత్రి ఆయన ఆకస్మికంగా సందర్శించి, వసతి గదులు, రెస్టారెంట్‌తో పాటు యూనిట్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అతిథులకు అందిస్తున్న సేవలు, నిర్వహణ, పరిశుభ్రత, వసతి సౌకర్యాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అహోబిలం హరిత యూనిట్‌లో ల్యాండ్ స్కేపింగ్ పనులను తక్షణమే చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మహానంది హరిత యూనిట్ అభివృద్ధి కోసం సమగ్ర పునరుద్ధరణ ప్రతిపాదనలను సిద్ధం చేసి వెంటనే సమర్పించాలని ఎస్ఈకి సూచించారు. ఏపీటీడీసీ డీఎం జి.లక్ష్మీనారాయణ, యూనిట్ మేనేజర్, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

**అక్రమ అరెస్టులపై ఖండన :** కర్నూలు(సెంట్రల్): జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను పత్తికొండలోనే ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులను అరెస్టు చేసి అక్రమ కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయా సంఘాల జిల్లా కార్యదర్శులు ఎస్.షాబీర్‌బాషా, కె.శ్రీనివాసులు తెలిపారు.


APSFC ISO

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ**

(రాష్ట్ర ఫైనాన్షియల్ కార్పోరేషన్ చట్టం 1951 యొక్క LXIII క్రింద చేర్చబడినది)

డోర్ నెం.50/706-సి, బి-క్యాంప్, కర్నూలు-518002, ఫోన్: 08518-229056. Email: kurnool@apsfc.com

**ఇ- వేలం అమ్మకం ప్రకటన**

SARFAESI చట్టం, 2002 ప్రకారం అమ్మకం నోటీసు (సెక్యూరిటీ ఇంటరెస్ట్ (అమలు) నియమాలు, 2002 లోని నియమం 9(1))

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 కింద సంక్రమించిన అధికారాలను ఉపయోగించి మరియు కింద పేర్కొన్న రుణగ్రహీత/తనఖాదారుల యొక్క హామీ ఆస్తులను స్వాధీనంలో ఉంచుకున్నందున, ప్రజలకు మరియు సంబంధిత రుణగ్రహీత/తనఖాదారులు, వారి చట్టపరమైన వారసులు/ప్రతినిధులలో సహా సంబంధిత వ్యక్తులందరికీ ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా, కింద జాబితా చేయబడిన ఆస్తులను కొనుగోలు చేయడానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక సంస్థ (APSFC) యొక్క అధీకృత అధికారి ద్వారా ఆఫర్లు ఆహ్వానించబడుతున్నాయి.

వ.నెం. 1 — ఋణగ్రహీత/హామీదారు : మెస్సర్స్. చంద్రశేఖర్ రైస్ మిల్, ప్రొప్రైటర్: లేటు శ్రీ వి.చంద్ర శేఖర్ గుప్తా. హామీదారులు: లేటు శ్రీ వి.చంద్రశేఖర్ గుప్తా మరియు లేటు శ్రీమతి వి.సుభద్రమ్మ చట్టపరమైన వారసులు: 1.శ్రీమతి వి.భాగ్యలక్ష్మి, 2.శ్రీ వి.రంజిత్, 3.శ్రీ వి.చరణ్, 4.శ్రీమతి. వి.రమ్య
బకాయి మొత్తం: 31-07-2026 నాటికి: రూ.214.31 లక్షలు, 01.08.2026 నుండి అదనపు వడ్డీ మరియు ఇతర ఖర్చులతో కలిపి
డిమాండ్ నోటీసు తేది : 27.09.2021, స్వాధీనత తేది: 25.11.2025 (FF) & 27.11.2025 (GF)

| స్థిరాస్తి వివరములు | రిజర్వు ధర (లక్షలలో) | ధరావత్తు (లక్షలలో) | బిడ్ పెంపుదల మొత్తం |
|---|---|---|---|
| నంద్యాల జిల్లా, ఆత్మకూరు మున్సిపాలిటీ, వాకిటిపేట, వార్డ్ నెం.10 (కొత్త), 4 (పాత)లో, డి.నెం.10-10,10-108/1 (కొత్త)లో గల నివాస భవనం, 78చ.గ.విస్తీర్ణం గల స్థలంలో నిర్మించిన భవనాలు మొదలైనవి. | 15.60 | 1.95 | రూ.0.20 లక్షలు |

వ.నెం. 2 — ఋణగ్రహీత/హామీదారు : మెస్సర్స్ శ్రవణ్ పాలిమర్స్, ప్రొప్రైయిటర్: శ్రీ వి.సుశాంత్, హామీదారులు: లేటు శ్రీమతి యు.ఎమ్ సలోమి, చట్టపరమైన వారసులు: 1.శ్రీమతి. ఎం.స్నేహలత, 2. శ్రీమతి. వి. బాల వేదమణి, 3. శ్రీ ఎమ్.జె బాబు రాజు
బకాయి మొత్తం: 31-07-2026 నాటికి: రూ.35.24 లక్షలు, 01.08.2026 నుండి అదనపు వడ్డీ మరియు ఇతర ఖర్చులతో కలిపి.
డిమాండ్ నోటీసు తేది: 24.09.2025 స్వాధీనత తేది: 26.11.2025

| స్థిరాస్తి వివరములు | రిజర్వు ధర (లక్షలలో) | ధరావత్తు (లక్షలలో) | బిడ్ పెంపుదల మొత్తం |
|---|---|---|---|
| కర్నూలు పట్టణం & జిల్లా, కల్లూరు గ్రామం, అరోరా నగర్, సర్వే నెం.731/2, 732/2&734లో, ప్లాట్ నెం.296 నందు డి.నెం.50-348-ఎల్-182 లో 133.30చ.గ. లేదా 2.75 సెంట్ల ఇంటి స్థలం. | 38.40 | 4.80 | రూ.0.20 లక్షలు |

ఇ-వేలం తేది & సమయం : తేది.04-09-2026 న ఉ.11.00 నుండి మ.12.00 గంటల వరకు
ఆసక్తి గల బిడ్డర్లు ఇ-వేలం నందు పాల్గొనుటకు మరియు వారి బిడ్లు సమర్పించుటకు ముందుగానే ఇ-వేలం యొక్క నియమములు & నిబంధనలు కొరకు మా వెబ్‌సైట్ పోర్టల్స్ https://esfc.ap.gov.in మరియు https://bankauctions.in దర్శించవలసినదిగా సలహా ఇవ్వడమైనది. ప్రతి టెండరుదారుడు ఈ అమ్మకం యొక్క నియమాలు మరియు నిబంధనలు పరిశీలించి మరియు ఆమోదించినట్లుగా భావించడమైనది.
EMD క్రింది తెలిపిన ఖాతాలో NEFT / RTGS ద్వారా చెల్లించాలి, బెనిఫిషియరీ: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫైనాన్షియల్ కార్పొరేషన్, బ్యాంకు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బుధవారపేట, కర్నూలు, Ac.No:005311011000353 (IFSC Code:UBIN0800538)
ధరావత్తుతో కూడిన టెండరు ఫారములు సమర్పించుటకు చివరితేది : 03-09-2026, సాయంత్రం గం.5.00 వరకు
ఏదేని వివరములు/సందేహాలకు సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఫోన్.: 888 666 7101 నందు బిడ్డర్లు సంప్రదించవచ్చును.
తేది: 03.08.2026, ప్రదేశం: కర్నూలు — సం/- అధీకృత అధికారి, APSFC కర్నూలు బ్రాంచ్



ఇండియన్ బ్యాంక్ Indian Bank

**ఇండియన్ బ్యాంక్**

కడప బ్రాంచ్, 20/918, కో-ఆపరేటివ్ కాలనీ, నెహ్రూ పార్క్ దగ్గర, కడప, కడప జిల్లా

**స్థిరాస్తులు విక్రయమునకు అమ్మకం ప్రకటన** "అపెండిక్స్-IV-A" (నిబంధన 9(1) అంశాలు చూడండి)

సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 9(1) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(ల)కు తెలియజేయునది ఏమనగా, దిగువ వివరించబడిన స్థిరాస్తులను ఇండియన్ బ్యాంక్, కడప బ్రాంచ్, (సెక్యూర్డ్ క్రెడిటర్)కు తనఖా పెట్టడం జరిగింది. సదరు ఆస్తులను ఇండియన్ బ్యాంక్, కడప బ్రాంచ్ (సెక్యూర్డ్ క్రెడిటర్) యొక్క అధీకృత అధికారి స్వాధీనం చేసుకున్నారు. బ్యాంక్‌కు చెల్లించవలసిన మొత్తాన్ని వసూలు చేయడానికి దిగువ వివరించబడిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా తేది.26-08-2026 న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించటమైనది.

ఋణగ్రహీతలు: 1) శ్రీ పిట్టర్ ఖద్రుద్దీన్, తండ్రి : శ్రీ పిట్టర్ మహబూబ్ పీరా, 2) శ్రీమతి షేక్ తహేరా బేగం కోగటం, భర్త : శ్రీ పిట్టర్ ఖద్రుద్దీన్, ఇరువురి చిరునామా : చిరునామా 1 : 14533 డైమండ్ పార్క్ లేన్, కాన్రో, టెక్సాస్-77384 యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా. చిరునామా 2 : 10503, ఫ్లాక్సెన్ మనోర్ CT స్ప్రింగ్, TX, 77379 యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా. చిరునామా 3: 8/188-1,అల్మాస్‌పేట,కడప-516001. చిరునామా 4: డి.నెం.2-17-1,జిఎమ్ టాకీస్,బనగానపల్లి,నంద్యాల జిల్లా-518124.

బకాయి మొత్తం: తేది.03-08-2026 నాటికి: రూ.7,57,49,966.00/- + మరియు తేది.04-08-2026 నుండి వడ్డీ, వ్యయాలు, ఇతర ఛార్జీలు మరియు ఖర్చులతో సహా.

స్థిరాస్తుల వివరములు: ఆస్తి-1: నంద్యాల జిల్లా, బనగానపల్లి టౌన్, వార్డు నెం.2, సర్వే నెం.189/2 వద్ద ఖాళీ స్థలం శ్రీ పిట్టర్ ఖద్రుద్దీన్, తండ్రి: పిట్టర్ మహబూబ్ పీరా గారికి చెందినది. స్థలము విస్తీర్ణం: ఎ.0-17 సెంట్లు లేదా 826.75 చ.గ.లు
హద్దులు: LSR మరియు డాక్యుమెంట్ ప్రకారం: తూర్పు: పి.మహబూబ్ పీరా గారి నుండి దరఖాస్తుదారుడు కొనుగోలు చేసిన స్థలము, పడమర: మసూమ్ బాషా దర్గా రోడ్డు, ఉత్తరం : సర్వార్ రోడ్, దక్షిణం : జియమ్ సినిమా హాల్ ప్రహరీ గోడ.
హద్దులు: EVR ప్రకారం: తూర్పు: దరఖాస్తుదారుని స్థలము, పడమర: రోడ్డు మసూమ్ బాషా దర్గా, ఉత్తరం: రోడ్, దక్షిణం: జియమ్ టాకీస్ ప్రహరీ గోడ.
రిజర్వు ధర : రూ.1,35,00,000/- ధరావతు : రూ.13,50,000/- బిడ్ పెంపుదల మొత్తం రూ.1,00,000/- ఆస్తి ఐడి నెం.: IDIB7492034562A

ఆస్తి-2: నంద్యాల జిల్లా, బనగానపల్లి మండలం, బనగానపల్లి గ్రామ పరిధిలో, సర్వే నెం. 189/1 లోని డి.నెం.2/17తో గల స్థలము మరియు జిఎమ్ పిక్చర్ ప్యాలెస్ నిర్మాణం శ్రీ పిట్టర్ ఖద్రుద్దీన్, తండ్రి : పిట్టర్ మహబూబ్ పీరా గారికి చెందినది.
స్థలము విస్తీర్ణం : 2914.88 చ.గ.లు హద్దులు: LSR మరియు డాక్యుమెంట్ ప్రకారం: తూర్పు: దామల వెంకట సుబ్బయ్య మరియు ఇతరులు స్థలము, ఇల్లు, పడమర: దరఖాస్తుదారు మరియు ఇతరుల రూములు, ఉత్తరం : ఫాతిమా బీ & ఇతరుల స్థలము, దక్షిణం: ఆర్&బి నంద్యాల రోడ్డు.
స్థలము విస్తీర్ణం: 2420.00 చ.గ.లు హద్దులు: EVR ప్రకారం: తూర్పు: డి వెంకట సుబ్బయ్య, పి.బ్రహ్మయ్య, వి.రామకృష్ణయ్య గార్ల స్థలము & దరఖాస్తుదారుని స్థలము, పడమర: దరఖాస్తుదారుని స్థలము, ఉత్తరం : దరఖాస్తుదారుని ఇల్లు, దక్షిణం : దాస్తా & దరఖాస్తుదారుని స్థలము.
ఆస్తి-3: నంద్యాల జిల్లా, బనగానపల్లి మండలం & గ్రామం, వార్డు నెం.2, సర్వే నెం.189/1 లోని ఖాళీ స్థలము శ్రీ ఖద్రుద్దీన్ పిట్టర్, తండ్రి: పిట్టర్ మహబూబ్ పీరా గారికి చెందినది. స్థలము విస్తీర్ణం : 305.55 చ.గ.లు (40 చ.గ.లు + 110.00 చ.గ.లు + 155.55 చ.గ.లు)
హద్దులు: ఐటమ్ నెం.1 (40 చ.గ.లు) : తూర్పు : సర్వే నెం.189/2 స్థలము, పడమర : 22' రాస్తా, ఉత్తరం : జి.ఎమ్.టాకీస్, దక్షిణం : ఆర్ & బి రోడ్డు.
హద్దులు: ఐటమ్ నెం.2 (110 చ.గ.లు) : తూర్పు : 22' రాస్తా, పడమర : 22' రాస్తా, ఉత్తరం : జి.ఎమ్.టాకీస్, దక్షిణం : ఆర్ & బి రోడ్డు.
హద్దులు: ఐటమ్ నెం.3 (155.55 చ.గ.లు) : తూర్పు : 22' రాస్తా, పడమర : ఫాతిమా బీ గారి స్థలము, ఉత్తరం : జి.ఎమ్.టాకీస్, దక్షిణం: ఆర్ & బి రోడ్డు.
రిజర్వుధర : రూ.6,35,00,000/- ధరావతు : రూ.63,50,000/- బిడ్ పెంపుదల మొత్తం రూ.1,00,000/- ఆస్తి ఐడి నెం.: IDIB7492034562

పైన పేర్కొన్న ఆస్తులపై ముందస్తు రుణ భారాలు: లేవు

**ఇ-వేలం తేది & సమయం: 26-08-2026 ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం గం.04.00 వరకు**

ఆన్‌లైన్ బిడ్‌లో పాల్గొనడానికి బిడ్డర్లు మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ PSB అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వెబ్‌సైట్ (https://baanknet.com) ను సందర్శించాలని సూచించడమైనది. సాంకేతిక సహాయం కోసం PSB అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ హెల్ప్‌డెస్క్ నంబర్ 8291220220, ఇమెయిల్: - support.BAANKNET@psballiance.com మరియు సర్వీస్ ప్రొవైడర్ల హెల్ప్‌డెస్క్‌లో ఉన్న ఇతర హెల్ప్‌లైన్ నంబర్లకు కాల్ చెయ్యగలరు. PSB అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో రిజిస్ట్రేషన్ స్థితి మరియు EMD స్థితి కోసం, దయచేసి support.BAANKNET@psballiance.com ని సంప్రదించండి. ఆస్తి వివరాలు, ఆస్తి యొక్క ఛాయాచిత్రం మరియు వేలం నిబంధనలు మరియు షరతుల కోసం దయచేసి https://baanknet.com సందర్శించండి. మరియు ఈ పోర్టల్‌కు సంబంధించిన వివరణల కోసం, దయచేసి హెల్ప్‌డెస్క్ నెం.8291220220 ని సంప్రదించండి.
బిడ్డర్లు https://baanknet.com వెబ్‌సైట్‌లో ఆస్తి కోసం చూస్తున్నప్పుడు పైన పేర్కొన్న ఆస్తి ID నంబర్‌ను ఉపయోగించాలని సూచించడమైనది.
సంప్రదించండి: 1) అధీకృత అధికారి, శ్రీ మనీష్‌కుమార్, ఫోన్ నెం.94906 90276, బ్రాంచ్ మేనేజర్: శ్రీ ఆయుష్ కుమార్, ఫోన్: 94906 90257
తేది: 04-08-2026, ప్రదేశం: కడప — సం/- అధీకృత అధికారి, ఇండియన్ బ్యాంక్, కడప బ్రాంచ్



**బహిరంగ ప్రకటన**

నా క్లైంట్ అయిన కుందూరు హర్షవర్ధన్ రెడ్డి, బోయ సంపత్ కుమార్ ల యొక్క హక్కు కలిగిన SY no : 324 పైకి లో విస్తీర్ణం: 1.88 సెంట్స్, SY no : 326/1 పైకి లో విస్తీర్ణం : 1.34 సెంట్లు, SY no: 326/2 పైకి లో విస్తీర్ణం : 4.16 సెంట్లు. లు మొత్తం విస్తీర్ణం: 7.38 సెంట్లు, నూనెపల్లి మజిర, నంద్యాల మున్సిపాలిటీ ఏరియా, నంద్యాల సబ్ రిజిస్టర్ పరిధిలోని LP.No: 9/2021/1017/KUDA/2021.గా ఉన్న భూమి Civil వివాదంలో జరుగుతున్నది. Hon'bul High Court of Andhra Pradesh నందు W.P no : 1198/2026గా వాదనలు జరుగుతున్నాయి. మరియు స్టే ఆర్డర్ ఉన్నది.
**Respondents**: 4.దొనపాటి నాగేశ్వర్‌రెడ్డి, 5.దొనపాటి వెంకటేశ్వర్ రెడ్డి లపై.

మరియు నంద్యాల జిల్లా కోర్టు 3rd Addi District Court నందు Civil దావలు పెండింగ్‌లో ఉన్నవి: 1.OS no: 42/2025 మరియు 2.OS no: 41/2025 మరియు 3.OS no: 1/2023. కూడా పిటిషన్ పెండింగ్‌లో ఉన్నవి. పిటిషనర్స్ V/s రెస్పాండెంట్స్ మధ్య వాదనలు జరుగుతున్నవి. కావున ప్రజలందరూ తెలుసుకొని ఎవరు కూడా అక్రమముగా రిజిస్టర్లు చేసుకోకూడదని & అక్రమముగా ప్రవేశించకూడదని ఈ పేపర్ ప్రకటన ద్వారా ద్వారా తెలుపుతున్నాము.

D.Chinna lingamaiah, Advocate, Nandyal. ✆ 9908747517.



సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

BUSINESS OFFER

ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్ లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి: 7406393937 [HA-599]

WANTED

ప్రముఖ ఫైనాన్స్ రంగంలో కర్నూలు లొకేషన్‌లో కలెక్షన్ లో అనుభవం కలిగిన టెలికాలర్స్ (F), ఎగ్జిక్యూటివ్స్ (M) కావలెను. సంప్ర: 93914 92449. [L-1299370]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.